
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం। 18। ఫిబ్రవరి। 2024



సోమశిలలో 20.639 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం సాయంత్రానికి 20.639 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.63,760
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,726
3 శాతం జీఎస్టీతో..	రూ.5,898
నవర (8 గ్రా)	రూ.47,184

గరిష్టం/కనిష్టం
33.1 /23.3

వాతావరణం

శనివారం గాలిలో తేమ 52 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. ఆదివారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

175 మంది హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు(టౌన్): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు సరిగా వేయని 175 మంది ప్రధానోపాధ్యాయులకు శనివారం డీఈఓ రామారావు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల హాజరును ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఉదయం 10.30 గంటల లోపే యాప్‌ల ద్వారా నమోదు చేయాల్సి ఉంది. అయితే శుక్రవారం సుమారు 3,300 మంది విద్యార్థులకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు కానీ, ప్రధానోపాధ్యాయులు కానీ హాజరు వేయకపోవడాన్ని జిల్లా విద్యాశాఖ అధికారులు గుర్తించి షోకాజ్ నోటీసులు అందజేశారు. సంబంధిత హెచ్‌ఎంలు వెంటనే వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

బర్డ్‌ఫ్లూ ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు

- జిల్లా పశువైద్యాధికారి మహేశ్వరుడు



మహ్మదాపురంలో కోళ్లఫాంను పరిశీలిస్తున్న డాక్టర్ మహేశ్వరుడు

పొదలకూరు: జిల్లాలో బర్డ్‌ఫ్లూ వైరస్ ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ మహేశ్వరుడు తెలిపారు. పొదలకూరు మండలంలోని మహ్మదాపురం కోళ్లఫాంను పరిశీలించి శానిటేషన్ చేయించేందుకు శనివారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి కోళ్లఫాంలో ప్రస్తుతం కోళ్లు లేవని, ఇటీవల అన్నీ మృతిచెందాయని తెలిపారు. అయితే ఒక కి.మీ. పరిధిలో ఉన్న చికెన్ షాపులు మూడు నెలలపాటు, 10 కి.మీ. పరిధిలో ఉన్న చికెన్ షాపులు మూడు రోజుల పాటు వ్యాపారాలు చేసేందుకు వీలు లేదన్నారు. ఇందుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు, తమ సిబ్బంది చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బతికి ఉన్న కోళ్లను చంపి పాతిపెడితే ఒక్కొక్క కోడికి రూ.90 వంతున చెల్లిస్తామన్నారు. ప్రస్తుతం జిల్లాలో బర్డ్‌ఫ్లూ అదుపులో ఉందని, మనుషులకు ఈ వ్యాధి సోకినట్లు ఇప్పటి వరకు కేసులు రాలేదన్నారు. ఆయన వెంట బీబీఆర్‌ఐ డీడీ ప్రసన్న, అడిషనల్ ఏడీ కిషోర్, ఏవీహెచ్‌లు డాక్టర్ మురళీకృష్ణారెడ్డి, రాధిక, ఏహెచ్‌ఏ సిబ్బంది ఉన్నారు.

చికెన్ షాపుల శుభ్రం

పొదలకూరు పట్టణంలోని చికెన్ షాపుల్లో శనివారం పంచాయతీ కార్యదర్శి దొరబాబు పారిశుధ్య సిబ్బంది ద్వారా శానిటేషన్ చేయించారు. పట్టణంలోని చికెన్ షాపుల్లో బ్లీచింగ్, సున్నంలతో శుభ్రం చేయించారు.

గ్యాస్ సిలిండర్‌పై అధికంగా వసూలు చేస్తే కేసులు

నెల్లూరు(పొగతోట): గ్యాస్ సిలిండర్ల డోర్ డెలివరీ సమయంలో అధికంగా నగదు వసూలు చేసే ఏజెన్సీలపై కేసులు నమోదు చేస్తామని డీఎస్‌ఓ డి.వెంకటరమణ శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. గ్యాస్ ఏజెన్సీలు 15 కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీకి రవాణా చార్జీలు అదనంగా వసూలు చేయకూడదని తెలిపారు. సిలిండర్లను వంద శాతం తనిఖీ చేసిన తర్వాతనే వినియోగదారులకు సరఫరా చేయాలని తెలిపారు. ఏజెన్సీలు పరిధికి మించిన గ్రామాలు, వినియోగదారుల వివరాలను డీఎస్‌ఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. నిబంధనలు పాటించని ఏజెన్సీలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులు గోడౌన్ నుంచి సిలిండర్ తీసుకువెళితే ఎలాంటి రవాణా చార్జీలు వసూలు చేయకూడదని తెలిపారు. సిలిండర్ తూకం సక్రమంగా ఉండేలా డెలివరీ బాయ్స్ వద్ద వేయింగ్ మెషీన్స్ ఉండాలని తెలిపారు. నిబంధనలు పాటించకుండా వినియోగదారులను ఇబ్బందులకు గురిచేసే ఏజెన్సీలపై డీఎస్‌ఓకు లేదా 18002333555 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

సీటుపై పేచీ

బేరసారాల్లో కావలి టీడీపీ టికెట్

- తనకు అడ్డురాకుండా బీద, మాలేపాటిలకు భారీగా ముడుపులిచ్చిన కావ్య
- స్థానిక సర్దుబాటుపై టీడీపీ అధిష్టానం ఆరా
- భారీ బడ్జెట్‌తో రావాలని కావ్యకు సందేశం
- మరో బడా నేతను బరిలోకి దింపే ప్రయత్నాలు చేస్తున్న అధిష్టానం



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కావలి నియోజకవర్గంలో ఇప్పటి వరకు టీడీపీ గెలిచింది రెండు దఫాలే. ఆ పార్టీ ప్రస్తుత పరిస్థితి క్షేత్రస్థాయిలో బలహీనంగా ఉంది. ఈ నేపథ్యంలో టీడీపీ టికెట్ల వ్యాపారానికి తెరతీసింది. ఎన్నికల వేళ టీడీపీలో సీట్లను అంగట్లో సరుకుగా మార్చేసింది. ఎవరెన్ని డబ్బు సంచులు ఇస్తే వారికే సీటు ఖరారు చేస్తున్న పరిస్థితి నెలకొంది.

బేరసారాలు మళ్లీ మొదలు

టీడీపీ కావలి టికెట్‌పై బేరసారాలు మళ్లీ మొదటికొచ్చాయి. ఇటీవలే టీడీపీ కావలి నియోజకవర్గ ఇన్‌చార్జిగా దగుమాటి వెంకటకృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి)ని అధిష్టానం నియమించింది. మైనింగ్ మాఫియాగా ఎదిగిన కావ్య ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీతో అంటకాగుతుంటారు. అయితే టీడీపీ అధిష్టానం కావలి టికెట్‌ను బేరానికి పెట్టిన నేపథ్యంలో అక్రమ మైనింగ్‌తో రూ.వేల కోట్లు దోచేసిన కావ్య కృష్ణారెడ్డి ఇచ్చిన డబ్బు సంచులకు సంతృప్తి పడిన ఆ పార్టీ అధిష్టానం కావ్యను నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఖరారు చేసింది. అంతేకాకుండా కావలి టికెట్ తనకే దక్కేలా కావ్య కృష్ణారెడ్డి స్థానిక టీడీపీ నేత బీద రవిచంద్రకు భారీగా డబ్బు ముట్టచెప్పడంతోపాటు ఇప్పటి వరకు కావలిలో ఆ పార్టీని నడిపిస్తున్న మాలేపాటి సుబ్బానాయుడుని కూడా సంతృప్తి పరిచినట్లు తెలిసింది. అయితే బీద రవిచంద్రకు కావ్య కృష్ణారెడ్డి సుమారుగా రూ.30 కోట్లు ఇచ్చాడని తెలుసుకున్న మాలేపాటి మళ్లీ టికెట్‌పై పేచీ పెట్టాడని తెలుస్తోంది. బీదతో కావ్య బేరం కుదుర్చుకుని నా సీటుకే ఎసరు పెట్టారంటూ మాలేపాటి పార్టీ అధిష్టానం వద్ద వాపోయాడని సమాచారం. బీదతో బేరం అనగానే ఎవరికెంత ముట్టిందో ఆరా తీసిన అధిష్టానం మీ బేరాలు సరే పార్టీకి ఎంత ఇస్తారో చెప్పమని చివరి దశలో పేచీ పెట్టింది. దీంతో కావలి టికెట్ విషయం మళ్లీ మొదటికొచ్చిందని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై రెండు రోజుల క్రితం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ పెద్దలతోపాటు కావ్య, బీద, మాలేపాటి సమావేశమై చర్చలు జరిపారని తెలిసింది.

బరిలోకి మరో బడా నేత

కావలిలో టీడీపీ గెలుపు అవకాశాలపై పరిశీలించిన ఆ పార్టీ అధిష్టానం.. కావ్య కృష్ణారెడ్డి లాంటి నేత కూడా పోటీకి సరిపోయే పరిస్థితి లేదని గ్రహించి.. మరో బడా నేతను బరిలోకి దింపాలని యోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కావలిలో సొంత క్యాడర్ బలం ఉన్న నేత అండతో ఆ బడా నేతను బరిలోకి దింపి అధికారపార్టీకి గట్టి పోటీ ఇవ్వాలనే ఆలోచనతో అధిష్టానం ఉన్నట్లు తెలుసుకున్న కావ్య పునరాలోచనలో పడినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రూ.కోట్లు కుమ్మరించినా.. గెలుపు అవకాశాలు తక్కువగా ఉండడంతో ఇంకెన్ని రూ.కోట్లు ధారపోయాలో అని మదనపడుతున్నట్లు సమాచారం. పార్టీకి, నేతలకే రూ.కోట్లు ముట్టజెబితే.. ఎన్నికల్లో ఇంకెంత ఖర్చవుతుందని సన్నిహితుల వద్ద వాపోతున్నారని తెలుస్తోంది. రెండు రోజుల క్రితం జరిగిన పార్టీ పెద్దల చర్చల్లో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించి.. ఇక మీ ఇష్టం అంటూ బయటకు వచ్చినట్లు సమాచారం.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండండి



అధికారులతో మాట్లాడుతున్న నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్

- ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు
- కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో అన్ని విభాగాలు సమన్వయంతో విధులు నిర్వహించి, ప్రణాళికాబద్ధంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని నెల్లూరు సిటీ నియోజకవర్గ-117 ఈఆర్‌ఓ, కమిషనర్ వికాస్‌మర్మత్ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని నగరపాలక సంస్థ ప్రాంగణంలో ఉన్న కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆయా పనులను ఇంజినీరింగ్ విభాగాధికారులు పర్యవేక్షించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పరిసరాలు, ప్రాంగణాల్లో పారిశుద్ధ్యం, ఆరోగ్య నిర్వహణ పనులను చేపట్టి ఓటర్లకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో నిర్వహించాల్సిన పనులను ముందస్తుగా పూర్తి చేసేందుకు వివిధ విభాగాల నుంచి అధికారులు, సిబ్బందిని పలు బృందాలుగా ఏర్పాటు చేసి జిల్లా యంత్రాంగానికి అనుసంధానంగా విధులు నిర్వహించేలా ఉత్తర్వులు తయారు చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన విధులను క్రమశిక్షణతో నిర్దేశించిన స్థాయిలో నిర్వర్తించాలని సూచించారు. సమావేశంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘ఈనాడు’ వక్ర దృష్టి

- నాడు-నేడు పనులకు గ్రహణం అంటూ తప్పుడు కథనం
- అభివృద్ధి చెందిన పాఠశాలలను దాచి అసత్యాలు ప్రచారం



నాడు-నేడు పనులతో కొత్తహంగులు సంతరించుకున్న కోవూరుపల్లి గిరిజనకాలనీ ప్రాథమిక పాఠశాల

ఫ్యాక్ట్ చెక్

బిట్రగుంట: బోగోలు మండలంలో మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా జరుగుతున్న పనులపై ‘ఈనాడు’లో ‘నాడు-నేడు పనులకు గ్రహణం’ పేరుతో శనివారం ప్రచురించిన కథనంపై అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దింది. టీడీపీ హయాంలో సున్నం వేసేందుకు నోచుకోని పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. పాఠశాలల రూపురేఖలు మార్చడంతోపాటు మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన బోధన దిశగా పలు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో నాడు-నేడుపై ఆది నుంచి అక్కసు వెళ్లగక్కుతున్న ‘ఈనాడు’ దశల వారీగా జరుగుతున్న పనులపై కూడా తనదైన ధోరణిలో ఒక కథనాన్ని వండి వార్చింది. నాడు-నేడు కింద జరుగుతున్న పనులకు గ్రహణం పట్టిందని, నిధులు విడుదల చేయడం లేదని ఆరోపించడంతోపాటు ఏకంగా ఉపాధ్యాయులను, తల్లిదండ్రుల కమిటీలను బినామీ కాంట్రాక్టర్లుగా వర్ణించింది. వాస్తవానికి ‘ఈనాడు’లో ప్రచురించిన జువ్వలదిన్నె జెడ్పీహైస్కూల్ పనుల్లో స్థల సమస్య కారణంగా జాప్యం ఏర్పడింది. ప్రభుత్వం ఏడాది క్రితమే నిధులు మంజూరు చేసినా స్థల సమస్య కారణంగా అధికారులు పనులు ప్రారంభించలేదు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మల చొరవతో నాలుగైదు నెలల క్రితమే స్థల సమస్య పరిష్కారం కావడంతో పనులు ఆలస్యంగా ప్రారంభించారు.



నాడు-నేడు కింద బోగోలు పాఠశాలలో ఏర్పాటు చేసిన బల్లలు, కొత్త బోర్డు, ఎల్ఈడీ టీవీ

రెండు విడతల్లో రూ.17 కోట్లతో పనులు

బోగోలు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నాడు-నేడు కింద ప్రభుత్వం రెండు విడతల్లో సుమారు రూ.17 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టింది. తొలి విడతలో 17 పాఠశాలల్లో 125 పనులు గుర్తించి రూ.4.4 కోట్లు కేటాయించగా రూ.3.37 కోట్లతో అధికారులు పనులు పూర్తి చేశారు. గతంలో రంగులు వెలసిపోయి, ప్రహరీలు లేక దుస్థితిలో ఉన్న పాఠశాలలు తొలి విడత పనులతో కొత్తరూపు సంతరించుకున్నాయి. రెండో విడతలో భాగంగా 33 ప్రభుత్వ పాఠశాలలు, ఏడు అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్తిస్థాయి వసతులు, అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం ప్రభుత్వం 343 పనులు గుర్తించి రూ.13.27 కోట్లు కేటాయించింది. వీటిలో సుమారు రూ.7.90 కోట్లతో చేపడుతున్న 204 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. కూలీల కొరత, స్థల సమస్య తదితర కారణాలతో పనులు జాప్యం జరుగుతున్న చోట ప్రత్యామ్నాయ పద్ధతుల్లో పనులు వేగవంతం చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

దశల వారీగా పనులు జరుగుతున్నాయి

బోగోలు మండలంలో నాడు-నేడు కింద దశల వారీగా పనులు జరుగుతున్నాయి. తొలి విడత, రెండో విడతల్లో భాగంగా అనేక పాఠశాలల్లో వసతులు సమకూరాయి. పాఠశాలల రూపురేఖలు మారడంతోపాటు తరగతి గదుల్లో విద్యార్థులకు అవసరమైన బల్లలు, కుర్చీలు, బోర్డులు, స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వచ్చాయి. కోట్లాది రూపాయలతో దశల వారీగా జరుగుతున్న పనులపై విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– ఎం.జయమ్మ, ఎంఈఓ-2, బోగోలు

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో..



దుత్తలూరు: స్థానిక బీసీ కాలనీ సమీపంలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండటాన్ని స్థానికులు శనివారం గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం దేవాంగ్‌నగర్‌కు చెందిన ఆవుల జిలానీ (50)గా విచారణలో పోలీసులు గుర్తించారు. నాలుగు రోజులుగా దుత్తలూరులో రోళ్లను తయారు చేసి వాటిని విక్రయించి జీవనం సాగిస్తున్నారని తెలిసింది. రాత్రి వేళ మద్యం సేవించి తాగు నీరు దొరక్క గొంతెండి మృతి చెంది ఉండొచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్సై ఉమాశంకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాడు అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితం

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: టీడీపీ హయాంలో గ్రామాల్లో అభివృద్ధి శిలాఫలకాలకే పరిమితమైందని, అయితే తమ ప్రభుత్వంలో అభివృద్ధి పనులను విస్తృతంగా చేపట్టామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు పంచాయతీ పొదలకూరు, చిట్టేపల్లిలో రూ.2.8 కోట్లతో పూర్తయిన అంతర్గత సీసీ రోడ్లు, రైతు భరోసా కేంద్ర పనులను మంత్రి శనివారం ప్రారంభించారు. పొదలకూరు నుంచి చిట్టేపల్లి వరకు యువత ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని పెద్ద ఎత్తున నిర్వహించారు. చిట్టేపల్లిలో ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. పంచాయతీ పరిధిలోని చిట్టేపల్లి, లింగంపల్లి, వెంకటేశ్వరనగర్, తోపు గ్రామాల్లో రూ.13.65 కోట్లతో అంతర్గత సిమెంట్ రోడ్లు, రూ.9.2 కోట్లతో సైడ్ డ్రెయిన్లను పూర్తి చేశామని వివరించారు. వాస్తవానికి చిట్టేపల్లిలో 2014, 2019 ఎన్నికల్లో తనకు తక్కువ ఓట్లు వచ్చాయని.. మెజార్టీ వచ్చిన గ్రామాలతో సమానంగా అభివృద్ధి పనులను చేపట్టామని తెలిపారు. రాజకీయాలను పక్కనబెట్టి సుపరిపాలనను చూసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటేయాలని కోరారు.



చిట్టేపల్లిలో సీసీ రోడ్లను ప్రారంభిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

సోమిరెడ్డి చరిత్రహీనుడు

టీడీపీ నేత సోమిరెడ్డి సర్వేపల్లిలో చరిత్రహీనుడిగా మిగిలిపోవడం ఖాయమని మంత్రి కాకాణి పేర్కొన్నారు. గ్రామాలకు వచ్చి రెచ్చగొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడం తప్ప ఒక్క అభివృద్ధి పనిచేశానని ఆయన చెప్పగలరానని ప్రశ్నించారు. చంద్రబాబే స్వయంగా ఫోన్లు చేసి ఆనం రామనారాయణరెడ్డి అభ్యర్థయితే ఎలా ఉంటుందని అడుగుతున్నారని తెలిపారు. కనీసం సోమిరెడ్డి పేరు జాబితాలో కూడా లేదని ఎద్దేవా చేశారు. వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, అరుణ, జెడ్పీటీసీ తెనాలి నిర్మలమ్మ, ఎంపీటీసీలు షాకీరాబేగం, లక్ష్మీకల్యాణి, శ్రీనివాసులు, పార్టీ మండలాధ్యక్షుడు పెదమల్లు రమణారెడ్డి, మాజీ ఎంపీపీ చినబ్రహ్మయ్య, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాసులురెడ్డి వెంకటరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా బీఏ ఎల్ఎల్‌బీ పరీక్షలు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద గల విక్రమ సింహపురి యూనివర్సిటీలో బీఏ ఎల్ఎల్‌బీ పరీక్షలను శనివారం నిర్వహించారు. ఉదయం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షకు 394 మంది, మధ్యాహ్నం జరిగిన ఐదో సెమిస్టర్ పరీక్షలకు 350 మంది హాజరయ్యారని వీఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి మధుమతి తెలిపారు.

నిమ్మ ధరలు

పెద్దవి:	రూ.75
సన్నవి:	రూ.60
పండ్లు:	రూ.26

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.146
లేయర్	రూ.80
బ్రాయిలర్ చికెన్:	రూ.256
స్కిన్‌లెస్ చికెన్:	రూ.284
లేయర్ చికెన్:	రూ.136

సవకతోట దగ్ధం

సంగం: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో సవకతోట దగ్ధమైన ఘటన మండలంలోని పడమటిపాళెంపల్లిలో శనివారం చోటుచేసుకుంది. రైతులు నెల్లూరు ఆదిశేషయ్య, వెంకటరమణయ్యకు సంబంధించిన 15 ఎకరాల సవకతోట దగ్ధమవడంతో గమనించిన రైతులు స్థానికులతో కలిసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.10 లక్షల మేర నష్టం సంభవించిందని రైతులు వాపోయారు.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం



ట్రాక్టర్‌ను ఢీకొని డివైడర్ ఎక్కిన కంటైనర్ లారీ

• ట్రాక్టర్‌ను ఢీకొన్న కంటైనర్ లారీ
• ఇంజిన్ కిందపడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఎన్టీఆర్‌నగర్ సమీపంలో గల జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందగా, ఇద్దరు కూలీలు గాయపడ్డారు. నార్త్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. బిహార్‌కు చెందిన లుక్‌మాన్ (42), అఖిల్.. మధ్యప్రదేశ్‌కు చెందిన ఆశిష్‌కుమార్ ఉపాధి నిమిత్తం నెల్లూరొచ్చారు. విక్రమ్‌నగర్‌లోని అర్జున్ వైష్ణవీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీలో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్‌నగర్ సమీపంలోని జాతీయ రహదారిపై డివైడర్ మధ్యలో ఉన్న చెట్ల కొమ్మలు రోడ్డుపైకి రావడంతో వాటిని అఖిల్, ఆశిష్ కుమార్ కత్తిరించారు. ఇంతలో ట్రాక్టర్‌ను లుక్‌మాన్ తీసుకొచ్చారు. చెట్లు కత్తిరించగా వచ్చిన చెత్తను ట్రాక్టర్ ట్రాలీలో అఖిల్, ఆశిష్‌కుమార్ వేయసాగారు. ఈ క్రమంలో చెన్నై వైపు నుంచి నాగాలాండ్ వెళ్తున్న కంటైనర్ లారీ వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో డివైడర్‌పైకి లారీ దూసుకురాగా, ట్రాక్టర్ బోల్తాపడింది. ట్రాక్టర్ ఇంజిన్ కిందపడటంతో లుక్‌మాన్ తలకు తీవ్రగాయంకాగా, మిగిలిన వారు గాయపడ్డారు. క్షతగాత్రులను హుటాహుటిన జీజీహెచ్‌కు స్థానికులు, హైవే పెట్రోలింగ్ పోలీసులు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే లుక్‌మాన్ మృతి చెందారు. మిగిలిన ఇద్దరూ చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న నార్త్ ట్రాఫిక్ ఎస్సై గీతారమ్య ఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన కంటైనర్ లారీని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్, క్లీనర్ పరారీలో ఉన్నారు. ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితురాల్లేని జీవితం వ్యర్థమంటూ..

• యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): స్నేహితురాల్లేని జీవితం వ్యర్థమనే మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. పడారుపల్లికి చెందిన వెంకటశ్రీసాయి అచ్యుత్ (28), భవానీ 2017లో ప్రేమ వివాహం చేసుకున్నారు. గతంలో ఓ షోరూమ్‌లో పనిచేసే సమయంలో అక్కడే పనిచేస్తున్న ఓ యువతితో అచ్యుత్‌కు పరిచయమైంది. ఇద్దరూ సన్నిహితంగా ఉంటున్న విషయం భార్యకు తెలియడంతో దంపతుల మధ్య విభేదాలు పొడచూపాయి. దీంతో ఆమెకు దూరంగా ఉంటానని భార్యకు మాటిచ్చారు. అయినా విడిచి ఉండలేకపోయారు. ఆమె లేని జీవితం వ్యర్థమని.. చనిపోవాలని ఉందని భార్యతో పలుమార్లు చెప్పేవారు. ఈ నేపథ్యంలో కాన్పు నిమిత్తం తన తల్లిదండ్రుల ఇంటికి భవానీ వెళ్లగా.. హైదరాబాద్‌లో ఉంటున్న కుమార్తె వద్దకు అచ్యుత్ తల్లి వెళ్లారు. అప్పటి నుంచి అచ్యుత్ ఒంటరిగా ఉంటున్నారు. పాపకు జన్మనిచ్చిన అనంతరం భవానీ తన భర్త వద్దకు గురువారం వచ్చారు. స్నేహితురాల్లేకపోతే చనిపోవాలని ఉందని భార్యకు మరోసారి చెప్పారు. అలాంటి పనులు చేయొద్దని, త్వరలో వచ్చేస్తానని భర్తకు నచ్చజెప్పి తన తల్లిదండ్రుల వద్దకు భార్య తిరిగెళ్లారు. ఈ నేపథ్యంలో తన ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు అచ్యుత్ శుక్రవారం పాల్పడ్డారు. గమనించిన ఇంటి యజమాని సురేష్ మృతుడి భార్యకు ఫోన్ ద్వారా విషయాన్ని తెలియజేశారు. హుటాహుటిన నెల్లూరు చేరుకున్న ఆమె వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

పట్టపగలు వింజమూరులో చోరీ



పరిశీలిస్తున్న పోలీసులు

• రూ.పది లక్షల విలువజేసే నగలు, నగదు అపహరణ

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల కేంద్రంలో శనివారం పట్టపగలు చోరీ జరిగింది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు.. స్థానిక రవి పాఠశాల సమీపంలో తెల్లపాడు జెడ్పీ పాఠశాల సోషల్ ఉపాధ్యాయుడు చిలకపాటి నారాయణ నివసిస్తున్నారు. విధులకు శనివారం ఆయన వెళ్లగా, కళాశాలకు కుమార్తె.. టైలరింగ్ శిక్షణ నిమిత్తం భార్య నారాయణమ్మ వెళ్లారు. ఈ తరుణంలో ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికొచ్చిన నారాయణమ్మ లోపలికి వెళ్లగా, బీరువా తలుపులు తెరిచి ఉండటాన్ని గుర్తించారు. అందులో బంగారం, నగదు కనిపించకపోవడంతో విషయాన్ని ఫోన్లో భర్తకు తెలియజేశారు. దీంతో ఆయన వెంటనే ఇంటికొచ్చి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై కోటిరెడ్డి పరిసరాలను పరిశీలించారు. వంటగది వద్ద ఉన్న కిటికీ గ్రిల్స్ స్క్రూలను తొలగించి దాని ద్వారా ఇంట్లోకి దుండగులు ప్రవేశించారనే అంశాన్ని గుర్తించారు. కలిగిరి సీఐ ఫిరోజ్, కావలి డీఎస్పీ వెంకటరమణ ఘటన ప్రాంతానికి వచ్చి బాధితుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వేలి ముద్రలను క్లూస్‌టీమ్ ద్వారా సేకరించారు. రూ.పది లక్షల విలువజేసే నగలు, రూ.30 వేల నగదు చోరీకి గురైందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

మనుబోలు: మండల పరిధిలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందారు. వివరాలు.. నెల్లూరుకు చెందిన దామిశెట్టి ప్రసాద్ (55) నాయుడుపేట పరిసర ప్రాంతాల్లో ప్లంబింగ్, ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుంటారు. తన పుట్టిన రోజు కావడంతో ఇంటికి బైక్‌పై ఈ నెల 14న బయల్దేరారు. ఈ క్రమంలో మనుబోలు మండలంలోని కొండూరుసత్రం సమీపంలో జాతీయ రహదారిపై డివైడర్‌ను బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. మనుబోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

